

సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి

## జేఎన్‌టీయూలో సైన్స్ ల్యాబ్

బాలానగర్ , మే 20 : అంతర్జాతీయ స్థాయిలో జేఎన్‌టీయూ ల్యాబ్‌ను రూపొందించనున్నట్లు వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రూ. 2 కోట్ల నిధులతో చేపట్టిన ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ జేఎన్‌టీయూలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో డైరెక్టర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ శశికళ ఆధునిక పరికరాలతో రూ. 2 కోట్లతో సైన్స్ ల్యాబ్‌ను సిద్ధం చేశారని తెలిపారు. సైన్స్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జేఎన్‌టీయూలో సైన్స్‌ల్యాబ్‌ను రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, వర్సిటీ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అవయవదానం.. ముగ్గురికి కొత్త జీవితం

మన్సూరాబాద్, మే 20: తాను మరణిస్తూ..మరో ముగ్గురికి ప్రాణం పోసింది ఓ మహిళ.. సూర్యాపేట జిల్లా, మోతె మండలం, తుమ్మగూడేనికి చెందిన ఉబ్బిపెల్లి ఉమ (33) భర్త మధుసూదన్‌తో కలిసి నగరంలో ఉంటున్నారు. ఈ నెల 16న రాత్రి ఎన్టీఆర్‌నగర్ వద్ద రోడ్డు దాటుతుండగా, వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఉమకు తీవ్ర గాయాలవ్వగా, చికిత్స కోసం ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానకు తరలించారు. వైద్యులు రెండు రోజుల పాటు చికిత్స అందించినా.. ప్రయోజనం లేకపోయింది. ఈనెల 18న ఉమ బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు ఆమె భర్త మధుసూదన్‌ను కలిసి.. అవయవదానంపై అవగాహన కల్పించారు. అతడి అంగీకారంతో ఉమ నుంచి రెండు కిడ్నీలు, లివర్, రెండు కార్నియాలను సేకరించారు.



ఉబ్బిపెల్లి ఉమ (ఫైల్‌ఫొటో)



బషీరాబాద్‌లోని ఓ కళాశాల సమీపంలో చెత్తాచెదారం

# ఎట్లుండె పల్లెలు
# ఎట్లైనయి..
## నిధులు విదల్చని కాంగ్రెస్ ప్రభుత్వం

- వచ్చి ఐదు నెలలైనా రూపాయీ కేటాయింపులేదు..
- జీతాలు రాకపోవడంతో పనులు చేపట్టని పారిశుద్ధ్య కార్మికులు
- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం.. ఎక్కడ చూసినా మురుగుపరుగే
- సమీపిస్తున్న వానకాలం.. వ్యాధులు ప్రబలే ప్రమాదం
- గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలంటున్న ప్రజలు
- గత బీఆర్ఎస్ హయాంలో స్వచ్ఛ పల్లెలుగా జీపీలు
- ఐదు నెలల్లోనే మారిన పరిస్థితి

గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో స్వచ్ఛ పంచాయతీలుగా మారిన పల్లెల్లో ప్రస్తుతం ఎక్కడ చూసినా మురుగునీటి ప్రవాహం, చెత్తాచెదారం దర్శనమిస్తున్నది. గతంలో ప్రతినెలా విడుదలయ్యే నిధులతో సర్పంచ్‌లు, అధికారులు గ్రామాల్లో రోడ్లు, మురుగు కాల్వలను శుభ్రం చేయించేవారు. కానీ.. ఐదు నెలల క్రితం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలకు రూపాయి కూడా కేటాయించకపోవడంతో పాలన పడకేసింది. ప్రతి రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించే పారిశుద్ధ్య కార్మికులకు కొన్ని నెలలుగా ప్రభుత్వం జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంతో వారు పనుల నిర్వహణపై శ్రద్ధ పెట్టడంలేదు. దీంతో ఇండ్ల మధ్యే చెత్తాచెదారం పేరుకుపోతున్నది. మురుగుకాల్వలు నిండి రోడ్లపై మురుగు పారుతుండడంతో ప్రజలు వాసనను భరించలేకపోతున్నారు. నిధుల లేమితో డ్రైనేజీ పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతులనూ చేపట్టలేని పరిస్థితి నెలకొన్నది. కేసీఆర్ ప్రభుత్వం ఇంటింటికెళ్లి తడి, పొడి చెత్తను సేకరించేందుకు ప్రతి గ్రామానికి ఒక ట్రాక్టర్‌ను మంజూరు చేయగా వాటి నిర్వహణ ఖర్చులు, డీజిల్, మరమ్మతులకు డబ్బుల్లేక మూలనపడ్డాయి. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ లోపించింది. రానున్నది వానకాలం కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య పనులు చేపట్టకుంటే రోగాలు ప్రబలే అవకాశం ఉందని.. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి గ్రామాలకు నిధులు కేటాయించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- వికారాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ)

### పంచాయతీలకు నిధులు కేటాయించాలి..



ఐదు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలకు పైసా నిధులు కేటాయించకపోవడంతో పల్లెల్లో ప్రగతి కుంటుపడింది. ప్రజలకు మౌలిక సదుపాయాలు అందడంలేవు. వేతనాలు చెల్లించకపోవడంతో పారిశుధ్య కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడి చెత్త అక్కడే గుట్టలుగా పేరుకుపోతున్నది. రానున్నది వర్షాకాలం కావడంతో పారిశుధ్య పనులు చేపట్టేందుకు ప్రభుత్వం వెంటనే నిధులను కేటాయించాలి. లేకుంటే ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉన్నది.

– చాకలి అంజిలయ్య, బొంరెడ్డిపల్లి, కులకచర్ల

### రోడ్లపైనే చెత్తాచెదారం..



బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పల్లెలు పచ్చబడి పరిశుభ్రం గా ఉన్నాయి. గతంలో కేసీఆర్ ప్రతినెలా గ్రామాల అభివృద్ధి కోసం నిధులను కేటాయించేవారు. దీంతో సర్పంచ్‌లు, అధికారులు ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించేవారు. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా పంచాయతీల అభివృద్ధికి రూపాయి కూడా విదల్చలేదు. దీంతో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందిపడుతున్నారు. రోడ్ల పక్కనే చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్గాంధాన్ని భరించలేకపోతున్నారు. మ్యాన్‌హోళ్ల మూతలు పగిలిపోయి మురుగు రోడ్లపై పారుతున్నది. ఇకనైనా పాలకులు స్పందించి నిధులు విడుదల చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలి

– చాకలి రాములు, పెద్దేముల్

### పైసా విదల్చని ప్రభుత్వం..



పంచాయతీలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపుతున్నది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పైసా కూడా విదల్చలేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టలేక ప్రత్యేక అధికారులు ఇబ్బందిపడుతున్నారు. ప్రజలకు మౌలిక వసతులు సమకూరడంలేదు. పల్లెల్లో పారిశుధ్యం లోపిస్తున్నది. మురుగు కాల్వలు శుభ్రంగా లేకపోవడంతో ఈగలు, దోమలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలి.

– తుప్పుడు శేఖర్, సిరిగిరిపేట, తాండూరు రూరల్

### చెత్త సేకరణ జరుగడం లేదు..



గ్రామాల్లో చెత్త సేకరణ సరిగ్గా జరుగడం లేదు. అధికారులను సంప్రదిస్తే పంచాయతీలో నిధుల్లేవు రాగానే పనులను ప్రారంభిస్తామని చెబుతున్నారు. దీంతో గ్రామం లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి పరిశుభ్రత లోపిస్తున్నది. రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి. ప్రజల ఆరోగ్యాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఐనెల్లి, తాండూరు రూరల్



బ్రాహ్మణపల్లిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

### గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలి..



గ్రామాల్లో సర్పంచ్‌ల పాలన ముగిసి ప్రత్యేక అధికారులు రావడంతో పారిశుధ్యం పడకేసింది. నిధుల లేమితో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా సాగడంలేదు. చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోతున్నది. దీంతో దోమలు, ఈగల మోత పెరు గుతున్నది. ఇప్పటికైనా పాలకులు స్పందించి గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి.

– రాజు బ్రాహ్మణపల్లి, దోమ

### పడకేసిన పారిశుధ్యం..



గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. బీఆర్ఎస్ హయాంలో పల్లెలు స్వచ్ఛతకు నిల యాలుగా మారాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవార్డులను కూడా పొందాయి. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో పల్లెల్లో పారిశుధ్యం లోపిస్తున్నది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు పేరుకుపోయి కంపుకొడుతున్నది. ఐదునెలలైనా రేవం త్ ప్రభుత్వం రూపాయి కూడా కేటాయించకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ కార్మికులు, సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో వారు బయట అప్పులు తెచ్చుకుని బతుకు బండిని లాగిస్తున్నారు.

– మామిళ్ల వెంకట్, పెద్దేముల్

### వ్యాధులు ప్రబలుతాయి..



ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి పనులు పెండింగ్‌లో పడుతున్నాయి. మౌలిక వసతులు కూడా సమకూరడంలేదు. దీంతో మహిళలు తాగునీటికి, రాత్రివేళల్లో వీధిలైట్లు వెలుగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిధుల కొరతతో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా సాగడం లేదు. వర్షాకాలం సమీపిస్తుండడంతో వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాలకవర్గాలు లేక, ఇంకోవైపు నిధుల్లేక పంచాయతీలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

– యాదప్ప, కొర్విచేడ్, బషీరాబాద్



బొంరాస్‌పేట మండలంలోని మదన్‌పల్లిలో..

**గతంలో ఏటా ఏప్రిల్‌లోనే టెండర్ల ప్రక్రియ**

**ఏడేండ్లుగా నిర్విఘ్నంగా సాగిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం**

**ఏటా 2 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేసిన కేసీఆర్ ప్రభుత్వం**

**ఈ ఏడాది ప్రశ్నార్థకంగా చేప పిల్లల పంపిణీ.. ఊసేలేని టెండర్ల ప్రక్రియ**

**మత్స్య కారుల్లో వ్యక్తమవుతున్న ఆందోళన**

**చేపల విక్రయాలతోనే జీవనోపాధి పొందుతున్న జిల్లాలోని 8,221 మత్స్యకార కుటుంబాలు**

## 'నీలి విప్లవ'ంపై
# నిర్లక్ష్యపు నీడలు

రంగారెడ్డి, మే 20(నమస్తే తెలంగాణ) : ఉచిత చేప పిల్లల పంపిణీకి సంబంధించి ఏటా ఏప్రిల్ మాసంలోనే టెండర్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నా.. మే నెల పూర్తి కావొస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ టెండర్ల దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ఇచ్చే నోటిఫికేషన్ అనుసరించి జిల్లా స్థాయిలో అధికారులు ఈ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఇంకా సర్కారు నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో ఈ ఏడాది జిల్లాలో నీలి విప్లవంపై నీలినీడలు కమ్ముకున్నాయి. చేపపిల్లల పంపిణీతో జిల్లాలో ఉపాధి పొందుతున్న 8,221 మత్స్యకార కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

### ఏడేండ్లుగా ఆర్థిక భరోసా..

జిల్లాలో 120 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 684 చెరువులున్నాయి. వీటి పరిధుల్లో 161 మత్స్య పారిశ్రామిక సహకర సంఘాలుండగా.. అందులో 8,221 మంది సభ్యులుగా ఉన్నారు. 2016-17లో కేసీఆర్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. మొదటి ఏడాది 25 లక్షల చేప పిల్లలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఏడేండ్లుగా విజయవంతంగా సాగింది. గడిచిన ఏడేండ్లలో 6.63 కోట్ల చేప పిల్లలను ఉచితంగా అందజేయగా.. ఇందుకోసం రూ.4.40 కోట్ల నిధులను ఖర్చుచేసింది. ఈ మేరకు 41,753 మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తితో రూ. 56.59 కోట్ల ఆదాయం సమకూరింది. జలాశయాల్లో ఉచితంగా వదులుతున్న బొచ్చ, రాహు, బంగారు తీగ, రొయ్య తదితర చేపలతో మత్స్యకారులు ఏడాది పొడవునా ఉపాధి పొందారు. ఇతర ప్రాంతాలకు కూడా ఎగుమతి చేశారు. చేప పిల్లలను వేటాడేందుకు వలలు, రవాణాకోసం ద్విచక్ర వాహనాలు, లగేజీ ఆటోలు, బొలెరో వాహనాలను ప్రభుత్వం అందజేసింది. అలాగే మహిళా సహకార సంఘాలకు విరివిగా రుణాలను అందించడంతో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలను నిర్వహించి ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం కల్పించిన భరోసాతో జిల్లాలో ఒక్కో మత్స్యకారుడు చేపల విక్రయాల ద్వారానే సగటున రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలకు పైగా లబ్ధి పొందాడు.

**రంగారెడ్డి జిల్లాలో గత ఏడేండ్లలో పంపిణీ చేసిన చేప పిల్లల వివరాలు**

| సంవత్సరం | పంపిణీ చేసిన మొత్తం చేపపిల్లల సంఖ్య | చేప పిల్లల కోసం వెచ్చించిన నిధులు | ఉత్పత్తి (మెట్రిక్ టన్నుల్లో) | ఆదాయం (రూ.లక్షల్లో) |
|---|---|---|---|---|
| 2016-17 | 10.10లక్షలు | రూ.18 లక్షలు | 5,510 | రూ.6,451 |
| 2017-18 | 99.74లక్షలు | రూ.63.10లక్షలు | 8,100 | రూ.10,320 |
| 2018-19 | 27.69లక్షలు | రూ.21.54లక్షలు | 3,491 | రూ.5,850 |
| 2019-20 | 70.54లక్షలు | రూ.33.06లక్షలు | 4,199 | రూ.4,006 |
| 2020-21 | 129.05లక్షలు | రూ.70.23లక్షలు | 4,305 | రూ.5,898 |
| 2021-22 | 169.13లక్షలు | రూ.117.19లక్షలు | 6,875 | రూ.10,211 |
| 2022-23 | 163.13లక్షలు | రూ.117.19లక్షలు | 9,273 | రూ.13,862 |



### ప్రశ్నార్థకంగా చేప పిల్లల పంపిణీ..

చేప పిల్లల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు టెండర్ల ప్రక్రియను చేపట్టకపోవడంతో ఇన్‌టైంలో చేప పిల్లలను పంపిణీ చేస్తారా?.. లేదా! అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏటా చేప పిల్లల పంపిణీని జూలైలోనే ముగించేవారు. ఏవైనా అవాంతరాలు ఏర్పడితే ఆగస్టు మొదటి వారంలో ఫినిష్ చేసేవారు. ఇందుకుగాను ప్రభుత్వం ఏప్రిల్ నుంచే సన్నాహాలు మొదలుపెట్టేది. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో పెంచేందుకు 80ఎంఎం నుంచి 100ఎంఎం సైజు చేప పిల్లలను.. అదేవిధంగా చెరువులు, కుంటల్లో పెంచేందుకు 35ఎంఎం నుంచి 400 ఎంఎం సైజులో ఉండే చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేసేది. అయితే ఈసారి ఇంకా టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో చేప పిల్లల పంపిణీ ఆలస్యమ య్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి. దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నది. ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీకి త్వరగా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.



# కదిలిన బల్దియా

**శిథిల భవనాల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్**

**రెండ్రోజుల్లో సమగ్ర నివేదిక**

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, మే 20, (నమస్తే తెలంగాణ) : ఎట్టకేలకు శిథిల భవనాలపై బల్దియా దృష్టిపెట్టింది. శిథిల భవనాల విషయంలో జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతూ 'నమస్తే'లో 19న ప్రచురుతమైన కథనానికి స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు.. ప్రమాదకర భవనాలను గుర్తించి , సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేసేందుకు సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రెండు రోజుల్లో 30 సర్కిళ్లలో కూలేందుకు సిద్ధంగా ఉన్న పురాతన భవనాలకు సంబంధించి నివేదికను కమిషనర్‌కు అందజేయనున్నారు. వానకాల విపత్తుల నివారణలో భాగంగా శిథిల భవనాలను గుర్తించడం, పురాతన భవనాల పటిష్టత , భద్రతపై ఇంజినీరింగ్ విభాగాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం, అత్యంత ప్రమాదకరమైన భవనాలను కూల్చివేసేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు సర్వే జరుపుతున్నారు. శిథిల, ప్రమాదకరమైన భవనాల్లో ఉన్న నివాసితులను గుర్తించి.. వారిని అక్కడిని నుంచి ఖాళీ చేయడానికి చర్యలు చేపట్టనున్నారు. వచ్చే నెల మొదటి వారంలో వర్షాకాలం మొదలవ్వనున్న నేపథ్యంలో పాత భవనాల రూపంలో ముప్పు రాకుండా భవన యజమానులను అప్రమత్తం చేస్తున్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న భవనాలను ఇప్పటికే గుర్తించిన అధికారులు.. నోటీసులు జారీ చేస్తున్నారు.